క్లుప్తంగా

ఎట్టకేలకు బీటీ రోడ్డు నిర్మాణం



రాయవరంలో నిర్వహిస్తున్న తారు ప్యాచ్ వర్క్ పనులు

రాయవరం: బీటీ రోడ్డు నిర్మాణ పనులను రాయవరంలో ఎట్టకేలకు ఆదివారం ప్రారంభించారు. అత్యవసర మరమ్మతుల్లో భాగంగా రాయవరం నుంచి లొల్ల వరకూ రెండు నెలల క్రితం ఈ పనులను మంజూరు చేశారు. అత్యవసర పనుల కింద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించారు. అందులో భాగంగా నెల క్రితం వెట్‌మిక్స్‌తో గోతులు పూడ్చారు. బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా బీసీ తారు ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేశారు. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి కానున్నట్టు ఆర్ అండ్‌బీ డీఈఈ టీవీఎస్ సూర్యానారాయణ రావు తెలిపారు.

మండపేటలో బీజేపీ శ్రేణుల బైక్ ర్యాలీ



మండపేటలో సంతోషం వ్యక్తం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

మండపేట: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించిన నేపథ్యంలో మరో ఐదేళ్ల దేశం మెరుగైన అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ మండపేట నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరాం అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆదివారం మండపేట పట్టణంలో బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. మిఠాయిలు పంచి సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ కో- కన్వీనర్ కంకటాల మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, నాయకులు చాత్రాతి జానకి రాంబాబు, వల్లభనేని రవీంద్రబాబు, నరాల రాంబాబు, మద్దుల సుబ్బారావు, రాయి వీర్రాజు, నామాల శ్రీనివాసు, దుర్గా శ్రీనివాస్, రావూరి బాబురావు, వెత్స ప్రసాద్, రమణ, రాజు, ఫణి ప్రకాష్, మాడా శ్రీనివాస్, వసంత, శివ ప్రసాద్ పాల్గొన్నారు

ఎమ్మెల్యే సుభాష్‌కు స్వాగతం



ఎమ్మెల్యే సుభాష్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

కాజులూరు: రామచంద్రపురం ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్‌కు నియోజకవర్గ ముఖద్వారమైన గొల్లపాలెంలో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కార్యకర్తలు స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా గెలుపొంది, రాజధాని నుంచి తొలిసారిగా ఆయన ఆదివారం నియోజకవర్గానికి వచ్చారు. ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్‌తో మండలంలో పలు గ్రామాల మీదుగా రామచంద్రపురం టీడీపీ కార్యాలయం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించాలని తొలుత పార్టీ శ్రేణులు నిర్ణయించారు. అయితే ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మరణంతో ఈ ర్యాలీ వాయిదా పడింది. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు గొల్లపాలెం చేరుకున్న ఎమ్మెల్యే సుభాష్ ధనమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిరాడంబరంగా కార్యకర్తలతో కలసి ఆర్యావటం, జగన్నాథగిరి, ద్రాక్షారామ మీదుగా రామచంద్రాపురం టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు.

ఆంగ్ల భాషతో భవిష్యత్తులో ప్రయోజనాలు



విద్యార్థినికి బహుమతి ఇస్తున్న సీఐ ప్రశాంత్‌కుమార్, ఎంఈఓ-2 ప్రకాష్

అంబాజీపేట: ప్రస్తుత పోటీ ప్రపంచంలో తెలుగుతో పాటు, అధిక ప్రాధాన్యం ఉన్న ఇంగ్లిష్‌ను ప్రతి విద్యార్థి ఇష్టంగా నేర్చుకోవాలని ఎంఈఓ-2 మోకా ప్రకాష్, పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన వినాయక యాడ్స్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతుల శిక్షణ ముగింపు కార్యక్రమం బొంతు రమేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ, సీఐ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న ఇంగ్లిష్‌ను ప్రతి రోజు అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో ప్రయోజనం ఉంటుందన్నారు. అనంతరం ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వల్లూరి జ్యోతి, వి.ఐశ్వర్య, ఏఎస్ఎన్ ప్రసన్నకు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణా తరగతులకు హాజరైన వారికీ బహుమతులు ఇచ్చారు.

చినుకు పడితే.. మలేరియా ఉనికి

- కాలం మార్పుతో వ్యాధి విజృంభణ
- అవగాహనే ఆయుధంగా నివారణ
- దోమల బెడదకు దూరంగా ఉండాలి
- విస్తృతంగా మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాలు



పడమర ఖండ్రిక గ్రామంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య కార్యకర్త



అనాఫిలిస్ దోమ

కపిలేశ్వరపురం: శాస్త్ర సాంకేతికతతో కాలం ముందుకు సాగుతున్నా వ్యాధుల తీవ్రత మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. ఎండ తీవ్రత తగ్గుతూ వర్షాలు పడే కాలం కావడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ దశలో పొడి, తడిగా ఉన్న వాతావరణం దోమలు సంచారానికి అనుకూలం. మలేరియా వ్యాధి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని 18 పీహెచ్‌సీల పరిధిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 1 నుంచి 30 వరకూ మలేరియా వ్యతిరేక మాసోత్సవాల పేరుతో వైద్యఆరోగ్యశాఖ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు.

మలేరియా ఇలా సోకుతుంది

అనాఫిలిస్ అనే ఆడదోమ మనిషిని కాటు వేసినపుడు ప్లాస్మోడియం అనే సూక్ష్మజీవి శరీరంలోకి చేరి మలేరియా వ్యాధి సోకుతుంది. అనాఫిలిస్ దోమ నీటిలో సంచరిస్తూ వంద మీటర్ల మేర మాత్రమే సంచరించగలదు. దోమ కాటుకు గురైన మనిషికి 10 నుంచి 15 రోజుల లోగా చలి, జ్వరం, వణుకు, వాంతులతో కూడిన చలి జ్వరం వస్తుంది. రెండు రోజులకోసారి జ్వరం రావడం, రాత్రి సమయంలో ఎక్కువగా ఉండడం మలేరియా లక్షణం. సాధారణ జ్వరంగా భావించి మందులు వేసుకున్నా మూడు గంటల్లో మళ్లీ జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తాయి. రోజులు గడిచే కొద్దీ చలితో జ్వరం, వణుకుతో జ్వరం, తీవ్ర జ్వరం వచ్చి చెమటలు పట్టి తగ్గిపోవడం అనే మూడు దశలు రోజూ కనిపిస్తాయి. ప్రాథమిక దశలోనే చికిత్సను ప్రారంభించాలి. తీవ్రత పెరిగితే మెదడు, మూత్రపిండాలు, కాలేయం దెబ్బ తింటాయి. సెరిబ్రల్ మలేరియా అత్యంత ప్రమాదకరం. చికిత్స ఆలస్యమైతే రోగి చనిపోయే పరిస్థితులు ఉంటాయి.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

దోమలు ప్రబలడానికి ప్రధాన కారణం క్షేత్రస్థాయిలోని పారిశుధ్య పరిస్థితులు. నివాసిత ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ చేపట్టాలి. పంచాయతీ పారిశుధ్య కార్మికులు అవసరానికి తగినంత మంది లేకపోవడంతో వర్షాలు పడినపుడు డ్రెయిన్లను శుభ్రపరచడం సమస్యగా మారుతోంది.

ప్రత్యేక కార్యక్రమాలు సాగించాలి

ఐదేళ్లల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ప్రతి శుక్రవారం ఫ్రైడే..డ్రై డే పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కనీసం వారంలో ఒక రోజు నివాస ప్రాంతాలను పొడిగా ఉంచడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టాలన్నది ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ కార్యక్రమాన్ని సక్రమంగా కొనసాగించాలి. ప్రస్తుతం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల పేరుతో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. రామచంద్రపురంలోని రెండు అర్బన్ పీహెచ్‌సీలు, వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీలు, కె.గంగవరం మండలంలోని పేకేరు, దంగేరు కుందూరు, మండపేటలోని రెండు అర్బన్ పీహెచ్‌సీలు, డి.కేశవరం, ద్వారపూడి, కపిలేశ్వరపురం మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీలు, రాయవరం మండలంలోని మాచవరం, రాయవరం పీహెచ్‌సీల ద్వారా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

నివారణే మెరుగైన మార్గం

వ్యాధుల బారిన పడి అవస్థలు పడే కంటే దోమల నివారణ మార్గాలను అనుసరించడం మేలు. దోమలు సాధారణంగా లార్వా, ప్యూపా అనే రెండు దశల్లో వృద్ధి చెందుతాయి. తొలి దశ నుంచి దోమగా పరిణామం చెందేందుకు వారం నుంచి పది రోజుల సమయం పడుతుంది. లార్వా దశలోనే వీటి వృద్ధిని నిలువరిస్తే వాటి ప్రభావాన్ని దాదాపు తగ్గించవచ్చు. దోమలు కుట్టకుండా నివారించేందుకు దోమ తెరలను వినియోగించాలి. పరిసరాల్లో నీటి గుంతలు, బురద, పేడ లేకుండా చూసుకోవాలి. పశువుల పాకలు వద్ద గంజి, దాణాలను వేసే గిన్నెల్లో నీరు చేరకుండా చూసుకోవాలి. ఆల్ అవుట్, దోమల చక్రాలను వాడడం విరివిగా చేస్తున్నారు. దాని వల్ల అనారోగ్యకర పరిస్థితులు న్నాయన్న వాదనైతే ఉంది కానీ నిర్ధారణ లేదు.

హామీలపై దృష్టి సారించాలి

కపిలేశ్వరపురం: కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి ఓ ప్రకటనలో కోరారు. అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ఎన్నికల సమయంలో హామీలను ఇవ్వడం , అధికారంలోకి వచ్చాక ఆర్థిక భారాలను సాకుగా చూపి ఇచ్చిన హామీలను మొక్కుబడిగా అమలు చేయడం గతంలో అనేక ప్రభుత్వాలు చేశాయని గుర్తు చేశారు. రానున్న ఐదేళ్లలో అలాంటి పరిస్థితి రానీయకుండా చూసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదన్నారు. శ్రామికవర్గ ప్రజలకు మేలు చేస్తే సంతోషిస్తామని, సమస్యలు పాలు చేస్తే ఉద్యమిస్తామని కృష్ణవేణి అన్నారు.

'చంటిబాబు'కు వైద్యుల పరామర్శ

రాయవరం: పితృ వియోగంతో బాధపడుతున్న మండలంలోని మాచవరం వైఎస్సార్ సీపీ నేత నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి (చంటిబాబు)ను పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఆదివారం పరామర్శించారు. ఈ నెల 4న చంటిబాబు తండ్రి గంగిరెడ్డి అకాల మరణం చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ క్రమంలో చంటిబాబును, ఆయన సోదరుడు వీర్రాఘవ రెడ్డిని ప్రముఖ వైద్యులు బిక్కిన గోపాలకృష్ణ, తేతలి నవీన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లిడి రామారెడ్డి, నాయకులు ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి (చినరెడ్డి), తాడి చంద్రశేఖరరెడ్డి, గొలుగూరి సుబ్బారెడ్డి, మేడపాటి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మల్లిడి భామిరెడ్డి, పడాల కమలారెడ్డి తదితరులు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

అదుపు తప్పితే.. అంతే సంగతులు



స్కూటర్‌పై కాలు పెట్టి మోటార్ బైక్ నడిపిస్తున్న యువకుడు

ప్రమాదం ఎప్పుడు, ఎలా ముంచుకొస్తుందో తెలియదు. ప్రమాదకరమని తెలిసి కూడా అయినా పలువురు దుస్సాహసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. మండలంలోని సోమేశ్వరం-రాజానగరం ప్రధాన రహదారిపై ఒక వాహనదారుడు మరో వాహనంపై కాలు పెట్టి ఇలా ప్రయాణం చేస్తున్నాడు. పెట్రోల్ అయిపోయిందో ఏమో..ఒక వాహనదారుడు తన కాలిని మరో మోటార్ సైకిల్‌పై అదిమిపెట్టి ఇలా ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న దృశ్యం. -రాయవరం

వర్షాల వేళ మాంసాహారంతో ముప్పే

- బాక్టీరియా, వైరస్ సోకే ప్రమాదం
- వర్షాకాలంలో వృక్ష సంబంధిత ఆహారం మేలు




గొర్రెల మంద

కపిలేశ్వరపురం: నాలుక కోరుకునే రుచుల కోసం ఎల్లవేళలా పాకులాడడం మానవ సహజం. అయితే ఆ తరహా కోరికలకు అంటూ కాలానుగుణంగా మినహాయింపు ఉంటాయని గమనించాలి. వాతావరణ మార్పులు మానవ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. శరీరం నిర్దిష్ట ఉష్ణోగ్రతలో ఉండాలి. వర్షాకాలంలో మానవ శరీరం చల్లటి వాతావరణానికి లోనవుతుంది. దీనికి తోడు వర్షాలకు బ్యాక్టీరియా, వైరస్‌లు వృద్ధి చెంది ప్రతికూల పరిస్థితులను కలిగిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో సూక్ష్మ క్రిములు మాంసంలో నాణ్యత, క్షీణత కలిగిస్తాయి. వాటి ప్రభావానికి లోనైన మాంసాన్ని ఆహారంగా తీసుకున్న వారికి తలనొప్పి, వాంతులు, జ్వరం, నీళ్ల విరేచనాలు కలుగుతాయి. ఇక నిల్వ మాంసం తింటే పరిస్థితి విషమంగా మారుతుంది. మండపేట, రామచంద్రపురం, అంగర తదితర ప్రాంతాల్లో మార్కెట్ల ద్వారా పెద్ద ఎత్తున మాంస విక్రయాలు సాగుతాయి. పట్టణాల్లో పెద్ద ఎత్తున రెస్టారెంట్లు, బిర్యానీ పాయింట్లు నిర్వహిస్తున్నారు. పలుమార్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు మండపేటలో నిల్వ మాంసాహారాన్ని గుర్తించి నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటి నేపథ్యంలో వర్షాలు పడుతున్న కాలంలో మాంసాహారాన్ని భుజించడం మానడం మేలు. తప్పని పరిస్థితి అనుకుంటే మాంసం కొనుగోలు, వండే పద్ధతిలపై పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. మాంసాహారాన్ని భుజించడం వల్ల కలిగే పరిణామాలపై కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు తెలిపిన వివరాలు ఇలా...

వర్షాకాలంలో ఇబ్బందులు

వాతావరణ మార్పుల వల్ల మాంసం తిన్న వారిలో బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు కలుగుతాయి. సహజంగా పశువులకు కూడా వర్షాకాలంలో పలు ఆరోగ్య సమస్యలు కలుగుతాయి. ఆ క్రమంలో వాటిని వధించి తినడం వల్ల ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇన్‌ఫెక్షన్లు సోకడంతో పాటు అజీర్తి, విరేచనాలు, జ్వరం రావడం వంటి సమస్యలు సహజంగా తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యం అందడంలో ఆలస్యమైతే విషమించి ప్రాణం మీదకు తెచ్చుకునే ప్రమాదం ఉంది.

జీవాలను వధించే పద్ధతి ఇదీ



జీవాలను వధించే పద్ధతి శాస్త్రీయంగా ఉండాలి. వధించడానికి ముందు, వధించిన తర్వాత పశువైద్యుడు జీవాన్ని పరీక్షించాలి. వధించిన మూడు గంటల తర్వాత మాంసంలో సహజసిద్ధంగా బరువు, నాణ్యతల్లో మార్పులు చోటు చేసుకుంటాయి. విక్రయ దుకాణం వద్ద ఈ మాంసపు భాగాలకు దుమ్ము, ధూళి చేరి బాక్టీరియా, వైరస్‌లు ఆశ్రయించే అవకాశం ఉంది. విక్రయించగా మిగిలిన మాంసాన్ని తర్వాత ఏ మాత్రమూ విక్రయించరాదు. నిల్వ చేయదలిస్తే నిర్దిష్టమైన శీతలీకరణలో భద్రపరచాలి. వండే క్రమంలో మాంసాన్ని పూర్తి స్థాయిలో ఉడికించి వండుకోవాలి. **బి.రామారావు, హెల్త్ ఎడ్యుకేటర్**

మూగ జీవాలకు ముప్పే!

- తొలకరిలో సీజనల్ వ్యాధుల విజృంభణ
- నిర్లక్ష్యం వహిస్తే పశువులకు ప్రాణాంతకమే..
- పశువుల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలంటున్న పశు వైద్యులు



పామర్రులో గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది(ఫైల్)

కె.గంగవరం: మూగజీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. ప్రత్యేకించి వర్షాకాలంలో పాడి పశువులతో పాటు, ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు తదితర మూగజీవాలు సీజనల్ వ్యాధులు సోకి అనారోగ్యానికి గురవుతుంటాయి. తొలకరిలో వ్యాపించే దొమ్మరోగం, జబ్బువాపు, చిటుక, గొంతు వాపు తదితర వ్యాధులతో మూగ జీవాలు విలవిల్లాడుతుంటాయి. పశు పోషకులు, గొర్రె, మేకల పెంపకందారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా అవి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

సాధారణంగా తొలకరి వర్షాలకు పొలాలు, కొండలు, గుట్టలు, బీడు భూముల్లో మొలక గడ్డి పెరుగుతుంది. ఈ గడ్డి చాలా ప్రమాదకరం. అలాగే చెరువులు, కాలువలు, కుంటల్లో కొత్త నీరు చేరుతుంది. ఆయా పరిస్థితుల్లో అపరిశుభ్రత, వాతావరణ మార్పుల వల్ల వివిధ రకాల వ్యాధులు పశువులకు సంక్రమిస్తుంటాయి. తొలకరి పచ్చికను మేసిన పశువులు, ప్రత్యేకించి గొర్రెలు, మేకలు ఒకేసారి పెద్ద సంఖ్యలో మృతి చెందిన సంఘటనలు చూస్తూనే ఉంటాం. సీజనల్ వ్యాధులపై పశు పోషకులు, గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు. మూగజీవాల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఏ మాత్రం అనుమానం వచ్చినా పశు వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. పశు వైద్య నిపుణుల వివరాల మేరకు కొన్ని వ్యాధులు, వాటి నివారణ చర్యలు ఇలా ఉన్నాయి.

జబ్బువాపు

క్లాస్ట్రీడియం చోవై అనే బ్యాక్టీరియా వల్ల ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఈ వ్యాధి వస్తుంది. జబ్బ వాపు వ్యాధి సోకిన పశువుల కండరాలు వాచిపోయి ఉంటాయి. ఆ కండరాలను చేతితో తాకితే గాలి బుగడల శబ్దం వినిపిస్తుంది. పశువులకు, జీవాలకు బీక్యూ టీకాలు వేయిస్తే వ్యాధి రాకుండా అరికట్టవచ్చు.

చిటుక వ్యాధి

సాధారణంగా గొర్రెలు, మేకల్లో ఇది వస్తుంది. క్లాస్ట్రీడియం పేరపిరిన్ జెన్స్ అనే బ్యాక్టీరియాతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాలు చాలా స్వల్ప సమయం అంటే చిటుక వేసే సమయంలోనే చనిపోయే అవకాశం ఉంది. ఈ వ్యాధి రాకుండా సకాలంలో టీకాలు వేయించాలి.

గొంతు వాపు

పశ్చురెల్లా మాల్టోసిడా, పాశ్చురెల్లా హిమోలైటిస్ అనే బ్యాక్టీరియాలతో ఈ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా నల్లజాతి పశువులు, గొర్రెలు, ఈ వ్యాధి బారిన పడతాయి. జీవాల్లో గొంతు వాచి, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చనిపోతాయి. ముందు జాగ్రత్తగా హెచ్ఎస్ టీకాలు వేయించాలి. వర్షాకాలంలో గొర్రెలకు ముందుగా నట్టల నివారణ మందులు వేసి, ముందు జాగ్రత్తగా టీకాలు వేయిస్తే ఈ రోగాల రాకుండా నివారించవచ్చు. గాలికుంటు వ్యాధి, నీలినాలుక వ్యాధి వంటి వైరస్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున, వైద్యులను సంప్రదించి పశువులకు టీకాలు వేయించాలి.

దొమ్మ రోగం (ఆంత్రాక్స్)

ఈ వ్యాధి ఆవులు, గేదెలు తదితర జీవాల్లో కనిపిస్తుంది. ఎక్కువగా గొర్రెలు, మేకల్లో చూస్తుంటాం. ఈ వ్యాధి సోకిన పశువుల్లో ముక్కు, పాయువు నుంచి గడ్డకట్టని తారు(నల్లని) లాంటి రక్తం కారుతుంది. బాసిల్లస్ ఆంత్రాక్స్ అనే బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులను, గొర్రెలు, మేకలను మంద నుంచి వేరు చేసి, చికిత్స అందిస్తే ముప్పు నుంచి తప్పించవచ్చు. ఇతర వ్యాధి సోకని పశువులకు, జీవాలకు ముందుగానే టీకాలు వేయించాలి. వ్యాధితో చనిపోయిన పశువులను గుంత తవ్వి, ఉప్పు, సున్నం, నీళ్లచల్లి పూడ్చిపెట్టాలి.

ప్రకృతి పరచిన పూలబాట



కొత్తపేట-పలివెల కెనాల్ రోడ్డులో తురాయి చెట్లు

జ్యేష్ఠ మాసం.. గ్రీష్మ రుతువు వచ్చిందంటే చాలు తురాయి చెట్లు కనువిందు చేస్తాయి. ఆహ్లాదాన్ని పంచుతాయి. ఉమ్మడి తూర్పుగోదారి జిల్లాలో అనేక చోట్ల జాతీయ, ఆర్అండ్‌బీ, స్థానిక రహదారుల వెంబడి ఉన్న వివిధ రకాల చెట్లలో ఎక్కువగా తురాయి చెట్లు కనిపిస్తాయి. ప్రస్తుత జ్యేష్ఠ మాసంలో ఆ చెట్లంతా నిండుగా ఎర్రని పూలు పూస్తాయి. ఆకులు కనిపించకుండా పుష్పాలే కనిపిస్తూ, రహదారులకు అందాన్ని తీసుకువచ్చాయి. ఆయా రహదారుల్లో ప్రయాణించే వాహనదారులను స్వాగతిస్తున్నట్టుగా ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చిన రాష్ట్రేతర వాసులు ఈ తురాయి పుష్ప సోయగాలు చూసి పులకిస్తున్నారు. – కొత్తపేట

బ్యాడ్మింటన్ విజేతలకు అభినందనలు



షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

అమలాపురం టౌన్: రోటరీ యువజన వారోత్సవాల క్రీడా పోటీల్లో అమలాపురం ఆఫీసర్స్ రీక్రియేషన్ క్లబ్ వేసవి ఉచిత క్రీడా శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులు షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో విజేతలుగా నిలిచారు. అండర్-13 బాలుర, అండర్-15 బాలికల విభాగాల్లో మొత్తంగా 17 మంది విద్యార్థులు గెలుపొందారు. ఆదివారం స్థానిక ఆఫీసర్స్ రీక్రియేషన్ క్లబ్‌లో విజేతలను ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ, అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, కార్యదర్శి ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీ, తిక్కిరెడ్డి సురేష్ అభినందించారు.

ఎరుకుల హక్కుల సంఘ అధ్యక్షుడు ఏడుకొండలు మృతి



బండారు ఏడుకొండలు(ఫైల్)

అమలాపురం టౌన్: స్థానిక ఏఎంజీ కాలనీకి చెందిన పట్టణ ఎరుకుల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండారు ఏడుకొండలు(57) మెదడు సంబంధిత వ్యాధితో ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడుకొండలు సోదరుడు, స్థానిక కౌన్సిలర్ బండారు గోవిందును పలువురు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎరుకుల హక్కుల కోసం పలు పోరాటాలు, ఉద్యమాలు చేసిన ఏడుకొండలు మృతిపై ఆయన సామాజిక వర్గీయులు ఆవేదనం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపినవారిలో ఎరుకుల హక్కుల సంక్షేమ సంఘం ప్రతినిధి ఉప్పు శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ, న్యాయవాది ఆర్.శ్రీనివాసరావు తదితరులున్నారు.

నీటి ప్రవాహానికి అవరోధం



చల్లపల్లి ప్రధాన పంట కాలువ దుస్థితి

ఉప్పలగుప్తం: ఇటీవల వీచిన ఈదురు గాలులకు మండలంలో పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. ఈ చెట్లు పంట కాలువలో పడటంతో చెత్త చెదారం పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయి. చల్లపల్లి ప్రధాన పంట కాలువలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు నేపథ్యంలో రైతులు నారుమడులు సిద్ధం చేసుకోవడానికి దమ్ము ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే పంట కాలువలో అడ్డగింతతో ప్రవాహం తగ్గి పొలాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందటం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పోతవరంలో బడి బాట

పి.గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కత్తుల ఆనందరావు అన్నారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని కోరుతూ ఆదివారం ఆయన ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులను కలుసుకుని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న బోధన, మౌలిక సదుపాయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.